ప్రచారంలో దూసుకుపోతున్న గులాబీ పార్టీ

# చేవెళ్లలో కారు జోరు

- గ్రామాల్లో ప్రజల నుంచి అపూర్వ స్పందన
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్న నేతలు
- నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రచారంలో పాల్గొంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య
- భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెబుతున్న పార్టీ శ్రేణులు





మొయినాబాద్ మండలంలోని ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య(ఫైల్)

### చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం..

చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేసి సీఎం కేసీఆర్‌కు కానుకగా పంపిస్తా. 60 ఏండ్లలో జరుగని అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలో చేసి చూపించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నాం. మా ప్రభుత్వం చేసిన పనులు చెప్పి ప్రజలను ఓట్లు అడుగుతున్నాం. ప్రతిపక్ష పార్టీల కల్లబొల్లి మాటలు నమ్మొద్దు. ప్రజల ఆశీర్వాదంతో చేవెళ్లలో మళ్లీ విజయం ఖాయం.

**– కాలె యాదయ్య, బీఆర్ఎస్ అభ్యర్థి, చేవెళ్ల**

షాబాద్, అక్టోబర్ 28 : ఎన్నికల ప్రచారంలో గులాబీ పార్టీ దూసుకెళ్తున్నది. చేవెళ్ల గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగురడం ఖాయం. ప్రతిపక్ష పార్టీలు ఊహించని విధంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నెల రోజుల ముందుగానే సిట్టింగ్‌లందరికీ టికెట్‌లు ప్రకటించారు. దీంతో అభ్యర్థులు ప్రచారంలో బిజిబిజీగా మారారు. 2014 ఎన్నికల్లో చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కాలె యాదయ్య అ తర్వాత కొద్ది రోజులకే బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తర్వాత 2018 ఎన్నికల్లో భారీ మెజార్టీతో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. పదేండ్ల కాలంలో ఐదు మండలాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలిచారు. వారం రోజుల కింద నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో మంత్రి మహేందర్‌రెడ్డితో పాటు ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు పాల్గొని బీఆర్ఎస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మరుసటి రోజు నుంచి రోజుకో మండలంలో ప్రచారం నిర్వహిస్తుండడంతో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నది. రెండు రోజుల కింద షాబాద్ మండలంలో జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 2వేల బైకులతో ర్యాలీ, ప్రజా ఆశ్వీరాద సభ సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజం ఏర్పడింది.

**గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన..**

నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబుపేట మండలాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు సాయం పెంపు, ఆసరా పింఛన్లు పెంపు, ప్రతి ఇంటికీ బీమా సదుపాయం, ఆరోగ్యశ్రీ, అన్నపూర్ణ పథకం ద్వారా పేదలకు సన్నబియ్యం, గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు తదితర అంశాలను ప్రజలకు వివరిస్తున్నారు.



షాబాద్ మండలంలో జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ(ఫైల్)

# కదం తొక్కిన.. గులాబీ దండు

- అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ వెళ్లి వివరిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థులు
- మళ్లీ ఆశీర్వదిస్తే అండగా ఉంటామని ప్రజలకు భరోసా
- అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం
- ఖాళీ అవుతున్న ప్రతిపక్ష పార్టీలు
- కాంగ్రెస్, బీజేపీని వీడి గులాబీ గూటికి..
- కందుకూరులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి సబితాఇంద్రారెడ్డి
- పలుగ్రామాల్లో ఎమ్మెల్యేల సమక్షంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లోకి చేరికలు

రంగారెడ్డి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల ప్రచారంలో గులాబీ దండు కదం తొక్కుతున్నది. బీఆర్ఎస్ అభ్యర్థుల తరపున ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. తొమ్మిదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ వెళ్లి వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని, సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలకు వివరిస్తున్నారు. మళ్లీ ఆశీర్వదిస్తే అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి శనివారం మహేశ్వరంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. మరోపక్క బీఆర్ఎస్ పార్టీలోకి వలసల పర్వం సైతం మరింత ఊపందుకున్నది. దీంతో ప్రతిపక్ష పార్టీలు ఖాళీ అవుతున్నాయి.

**హోరెత్తిన ప్రచారం..**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శనివారం కందుకూరు నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాల్‌లో పార్టీ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. ఇంటింటి ప్రచారంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. మళ్లీ అధికారంలోకి సీఎం కేసీఆర్ వస్తేనే ఈ ప్రాంతంలో మెట్రో రైలు పరుగులు పెడుతుందని, మెడికల్ కాలేజ్ కార్యరూపంలోకి రావడంతోపాటు మహేశ్వరం మరో హైటెక్ సిటీగా మారుతుందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి పెద్ద ఎత్తున మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్ ఫరూక్‌నగర్ మండలంలోని కొండన్నగూడ, వెంకన్న గూడ, బుచ్చుగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చౌదరిగూడెం మండలంలోని గాలిగూడ గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అనాజీపూర్, లోయపల్లి గ్రామాల్లో నిర్వహించిన ధూంధాం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..

- ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి
- కార్యకర్తలే నా బలం, బలగం
- మహేశ్వరంలో మళ్లీ గులాబీ జెండా ఎగురడం ఖాయం
- మహేశ్వరంలో ఎన్నికల పార్టీ కార్యాలయం ప్రారంభించిన మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 28 : ఆశీర్వదించండి.. మహేశ్వరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా.. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే తుది శ్వాస ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తానని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బాబయ్య ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మీర్‌పేటలో శుక్రవారం రాత్రి ఎన్నికల కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ తీశారు. సీఎం కేసీఆర్ జిందాబాద్, సబితమ్మ నాయకత్వం వర్ధిల్లాలి అన్న నినాదాలు మార్మోగాయి. మంత్రి సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు మరోసారి సేవచేసే అవకాశాన్ని సీఎం కేసీఆర్ కల్పించారని, 30 రోజులు నా కోసం పని చేస్తే శ్వాస ఉన్నంత వరకు ప్రజా సేవ చేస్తానని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సబితమ్మ వెనుక ఉన్న బలాన్ని చూసి మహేశ్వరం నియోజకవర్గం నుంచి ఢిల్లీలో చర్చలు చేస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. 15లక్షల మందికి దళితబంధు పథకం అందజేశామన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతుబంధు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే మెట్రో రైలు పరుగులు పెడుతుందన్నారు. మెడికల్ కళాశాలలు ఏర్పాటు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతాఅంద్యానాయక్, కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజు నాయక్, పాండు యాదవ్, కూన యాదయ్య, సుధీర్‌గౌడ్, మద్ది కర్ణాకర్‌రెడ్డి, అంజయ్య ముదిరాజ్, లచ్చునాయక్, సమీర్ వర్కాల యాదగిరి, కర్రొల్ల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరంలోని కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు



మహేశ్వరంలోని కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

# హైటెక్ ప్రచారంలో దూసుకెళ్తున్న మంచిరెడ్డి

సోషల్‌మీడియా వేదికగా విస్తృత ప్రచారం.. బూత్ కన్వీనర్లతో నిత్యం వీడియో కాన్ఫరెన్స్

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 28 : బీఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హైటెక్ ప్రచారంతో దూసుకెళ్తున్నారు. అన్ని పార్టీలకంటే ముందంజలో ఉన్నారు. పదిహేను రోజుల కిందే మంచిరెడ్డిని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్ఎస్ అధిష్టానం ప్రకటించింది. అప్పటి నుంచే తనకున్న రాజకీయ అనుభవంతో పాటు సోషల్ మీడియా వేదిక విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలస్థాయి, ముఖ్య కార్యకర్తలు, మున్సిపాలిటీల బూత్ కమిటీల కన్వీనర్లతో సమావేశాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్‌లో కాలనీల వారీగా ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇస్తున్నారు.

**ప్రతి రోజు టెలికాన్ఫరెన్స్..**

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బూత్ కన్వీనర్లతో ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 319 బూత్‌లు ఉన్నాయి. ఈ బూత్‌లకు గానూ 360 మంది కన్వీనర్లను ఏర్పాటు చేశారు. పెద్ద బూత్‌లకు ఇద్దరు చొప్పున మిగిలిన వాటికి ఒకరి చొప్పున బూత్ కన్వీనర్లను నియమించారు. వీరి ఫోన్‌నంబర్లకు ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆయన తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నిత్యం టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ వివిధ అంశాలపై మాట్లాడటంతో పాటు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. సోషల్‌మీడియాలోనూ వార్డుల వారీగా ఇన్‌చార్జిలను నియమించి సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ప్రస్తుత మ్యానిఫెస్టోపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గ్రామాల వారీగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. సమయం తక్కువగా ఉండటం వల్ల ఈ హైటెక్ ప్రచార సాధనాలను వినియోగించుకుంటున్నారు.

**ధూంధాంలతో హోరెత్తిస్తున్న ప్రచారం..**

నియోజకవర్గంలోని మేజర్ గ్రామాల్లో ధూంధాం కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. యాచారం మండలంలోని మేడిపల్లి, ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్‌పూర్, మంచాల మండలంలోని లోయపల్లిలో ధూంధాం కార్యక్రమాలు నిర్వహించారు. త్వరలోనే మున్సిపాలిటీ కేంద్రాల్లోనూ ధూంధాం కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**చతికిలబడిన కాంగ్రెస్, బీజేపీలు..**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీజేపీ టికెట్‌ను దయానంద్‌గౌడ్‌కు అధిష్టానం కేటాయించింది. ఆయన అభ్యర్థిత్వంపై చాలామంది సీనియర్ నాయకులు అలకబూనారు. అభ్యర్థిని ప్రకటించి వారం రోజులు కావస్తున్నప్పటికీ క్యాడర్ వైపు చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి రెండోవిడుతలో టికెట్‌ను కేటాయించారు. ఆ పార్టీ కూడా ప్రచారాన్ని ప్రారంభించలేదు. ఆ పార్టీ టికెట్ ఆశించిన దండెం రాంరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేయడానికి యత్నిస్తుండగా మర్రి నిరంజన్‌రెడ్డి ఇంకా తన నిర్ణయాన్ని ప్రకటించలేదు.



ధూంధాం కార్యక్రమంలో భాగంగా మహిళలతో ముచ్చటిస్తున్న మంచిరెడ్డి



ప్రచార రథాలు